క్లుప్తంగా

పెండింగ్ ఆసరా పింఛన్లు ఇవ్వాలి

మరికల్: మండలంలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ సింగ్, ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గతేడాది రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ల జాబితాలో కొందరు వృద్ధులు, వితంతువుల, దివ్యాంగులకు సంబంధించిన పింఛన్లు వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారన్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారు మండల, జిల్లా అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా వీరి గోడును ఎవరూ పట్టించుకోవడం అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వాటితో పాటు 59 ఏళ్లు నిండిన వృద్ధుల నుంచి దరఖాస్తులు తీసుకొని ఆసరా పథకం కింద పింఛన్లు మంజూరు చేయాలని వారు కోరారు.

ఘనంగా గంధోత్సవం



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో గురువారం రాత్రి హజ్రత్ జిందా షావలి గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ఇంటి నుంచి గ్రామ పురవీధుల గుండా గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. దారిపొడవున భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, సిద్రామప్ప, యాకూబ్‌అలీ, మున్న, బస్వరాజు, మల్లప్ప పాల్గొన్నారు.

భూ తాపం తగ్గిన తర్వాతే విత్తుకోవాలి

మరికల్: భూమిలో పూర్తిగా వేడి తగ్గిన తర్వాతనే రైతులు పత్తి విత్తనాలను నాటాలని ఏఓ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు తొందర పడి విత్తనాలు నాటారని తెలిపారు. ఇలా విత్తనాలు నాటితే భూమిలో ఉన్న వేడి వల్ల విత్తనాలు మాడిపోయే ప్రమాదం ఉందన్నారు. వర్షాలు పూర్తి స్థాయిలో కురిసిన తర్వాతనే విత్తనాలు నాటితే మొక్క ఎదుగుదల బాగుటుందని తెలిపారు. అనుమతులు ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొన్న వాటికి రశీదులు పొందాలని రైతులకు సూచించారు.

ఆయిల్ పాం సాగు లాభదాయకం

కోస్గి: రైతులు ఆయిల్ ఫాం సాగుచేసుకొని లాభాలు ఆర్జించాలని ఏఈఓ నరేందర్ సూచించారు. శుక్రవారం బోగారం రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులకు ఆయిల్ ఫాం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట సాగు కోసం ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఫామ్ ఆయిల్ తోటలకు సంబంధించిన రాయితీలు, ఇతర సాగు విధానాన్ని అధికారులు సమగ్రంగా వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఏఈఓలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



మక్తల్: మాగనూర్ మండలం ఓబ్లాపూర్ గ్రామానికి అంజప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను సీఐ సీతయ్యను అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో గట్టు తిమ్మప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నూతనంగా విగ్రహాలు ప్రతిష్ఠించి 16 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం హోమం నిర్వహించారు. నూతన విగ్రహాలకు పాలాభిషేకంతో చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేదపండితుల నుంచి భక్తులు ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సంతోస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిర, నిర్వాహకులు మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, బాల్‌రాజ్, సత్యనారాయణ, వెంకటేష్, నరేష్, రవికుమార్, అంజనేయులు, కృష్ణయ్య, విశ్వనాథ్, తదితరులు భక్తులు పాల్గొన్నారు.



మరమ్మతు చేసేదెప్పుడో?



రాంకిష్టాయిపల్లి శివారులో తెగిన కెనాల్ పక్కనున్న రోడ్డు

- గతేడాది వర్షకాలంలో తెగిన కాల్వ రోడ్డు
- కొండ్రోన్‌పల్లి, రామకిష్టాయిపల్లి రైతులకు ఇబ్బంది
- పంటను తరలించేందుకు తిప్పలు

ధన్వాడ: మండలంలోని రాంకిష్టాయిపల్లి శివారులో ఉన్న జూరాల డ్యాం నుంచి కోయిల్‌సాగర్ డ్యాంకు నీరు తరలించే కెనాల్ పక్కనున్న రోడ్డు రాంకిష్టాయిపల్లి నుంచి కొండ్రోన్‌పల్లి శివారు వరకు ఉంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఆ రోడ్డు తెగిపోయింది. అంతే కాకుండా కెనాల్ కూడా పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి.. మరమ్మతు చేయించండని అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదు.

పట్టించుకోని అధికారులు...

రోడ్డు తెగిపోవడంతో కోసిన పంటను రవాణా ఎలా చేయాలో తెలియక రైతులు నానా తిప్పలు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు సమాచారం ఇచ్చిన వారు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాగే రోడ్డు తెగిపోతే సొంత డబ్బులు ఖర్చు చేసి తెగిన రోడ్డును మట్టితో నింపి రాకపోకలు కొనసాగించామని, ఇప్పుడు అంతకన్నా పెద్ద స్థాయిలో రోడ్డు తెగిపోయిందని రైతులు వాపోయారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. కెనాల్ పక్కన ఉన్న చిన్నపాటి చెరువు నుంచి వర్షాకాలం సమయంలో అలుగు ద్వారా నీరు కాల్వలోకి చేరుతుంది. నీరు చేరే సమయంలో రోడ్డు మొత్తం కొట్టుకుపోతుంది. ఈసారైనా అధికారులు శాశ్వత పరిష్కారం చేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే పనులు చేయాలి



రోడ్డు తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంట చేతికి వస్తే కోతలు చేసేందుకు వాహనం కూడ వెళ్లే పరిస్థితి లేదు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వెంకట్‌రెడ్డి, రాంకిష్టాయిపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కెనాల్ పక్కన్న ఉన్న పంట పొలాలకు వెళ్లే రోడ్డు తెగిపోయిందని అధికారులకు తెలియజేశాం. గతేడాది వర్షాకాలంలో చెబితే నేటికి అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేస్తే రైతులకు ఇబ్బందులు తొలుగుతాయి.

– మాదవరెడ్డి, సర్పంచు రాంకిష్టాయిపల్లి

అధికారులను పంపిస్తాం

అధికారులను పంపించి, క్షేత్ర స్థాయిలో నష్ట తీవ్రతను అంచనా వేస్తాం. దానికి అనుగుణంగా బిల్లులు పెట్టి పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రతాప్‌సింగ్, ఈఈ, కోయిల్‌సాగర్

కొండ్రోన్‌పల్లిలో నూతన రేషన్ షాపు ప్రారంభం



రేషన్ షాపును ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మ

ధన్వాడ: మండలంలోని కొండ్రోన్‌పల్లిలో శుక్రవారం నూతన రేషన్ షాపును సర్పంచ్ పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో జనాభాకు అనుగునంగా నిత్యావసర సరుకులు అందించేందుకు నూతన రేషన్ షాపును ప్రభుత్వం మంజూరు చేసిందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజవర్ధన్, ఎంపీటీసీ కొండమ్మ, ఉపసర్పంచు భాగ్యమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, డీలర్ చరిత, బాల్‌రాజు, మొగులయ్య, మాధవరెడ్డి, కొండారెడ్డి, వెంకటయ్య, నర్సిములు, నాగమ్మ, సంజన్న, గోపాల్‌రెడ్డి, హన్మిరెడ్డి, బాలయ్య, గోపాల్, అంజనేయులు తదితరుల పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

నారాయణపేట: సారా తయారి చేసినా, విక్రయించినా కేసులు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేందర్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఊటకుంటతండా, అభంగపూర్‌లో పోలీస్‌బృందంతో కలిసి దాడులు నిర్వహించారు. ఊటకుంటతండాలో 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గ్రామస్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ ఎవరైనా గుట్టలు, పంట పొలాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లయితే మానుకోవాలని హెచ్చరించారు. గంజాయితో ఆరోగ్యం పాడవుతుందని, వాటికి దూరంగా ఉండాలని కోరారు. సారాయి తయారు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.



ఊటకుంటతండాలో బెల్లంపానకం పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసు అధికారులు

'దోస్త్'ను సద్వినియోగం చేసుకోవాలి

మక్తల్: డిగ్రీ కళాశాల ప్రవేశాల కోసం దోస్త్ వెబ్‌సైట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మవతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి మక్తల్ ప్రభుత్వ కళాశాలలో బీఏ, బీకాం, (కంప్యూటర్స్), అప్లికేషన్స్, లైఫ్ సైన్స్, బీఎస్‌సీ (ఫిజికల్) పోగ్రాంలో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. జూన్ 10వ తేదీ వరకు మొదటి దశ అడ్మిషన్లు పూర్తవుతాయని తెలిపారు. వివరాల కోసం ఎస్‌సీఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నారాయణపేట సెల్: 9959381282, పాలామూరు విశ్వవిద్యాలయం సెల్: 8142848369, ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెల్: 8977980981 హెల్ప్‌లైన్ సెంటర్లను సంప్రదించాలని కోరారు.

కనీస వేతనాలు అందించాలి

ధన్వాడ: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కనీస వేతనం అందడం లేదని, పనికి తగ్గ వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ రూ.100 కూలి వస్తే కుటుంబం ఎలా పోషించాలని ప్రశ్నించారు. వచ్చే కూలీ డబ్బులకు సైతం నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. కూలి రోజుకు రూ.600 అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న కూలీలు

బీజేపీతోనే సంక్షేమ పథకాలు సాధ్యం



మాట్లాడుతున్న నర్సన్‌గౌడ్

ధన్వాడ: వచ్చే ఎన్నికలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా గ్రామ స్థాయి నుంచే పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండల ఇన్‌చార్జ్ నర్సన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర నిధులను వాడుకుంటూ గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి పథకాన్ని గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికీ చేరేలా బూత్ స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాకం సురేందర్, కిషాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, రాష్ట్ర నాయకులు ఉదయభాను, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఎర్రప్ప, శివరాజు, నారాయణ, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగం పుస్తకాన్ని పంపిణీ చేయాలి

మక్తల్: రాజ్యాంగాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని శుక్రవారం తహసీల్దార్ తిరుపతయ్యకు ధర్మసమాజ్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పౌరలందరికి రాజ్యాంగంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో సూర్యకళ, ఓబులేస్, నర్సిములు, తాయప్ప, రాజు, దయానంద్, తాయప్ప, వీరేస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



మక్తల్: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచు రాధ, ఎంపీటీసీ తిమ్మప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని వనాయికుంటలో కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. కంటి ఆపరేషన్‌తో పాటు మందులు, అద్దాలు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. మొదటిరోజు 60 మంది కంటి పరీక్షలు చేశారు.కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, శంకర్, ఉప సర్పంచ్ నర్సిములు, వైద్య సిబ్బంది హర్ష, సుజాత, అనసూయ, అంగన్‌వాడీ టీచర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బెల్లి లలితకు ఘన నివాళి



కోస్గి: తెలంగాణ ఉద్యమకారిణి బెల్లి లలిత వర్ధంతిని శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం, యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు బస్వరాజ్ యాదవ్, నర్సిములు, పూర్ణచందర్ యాదవ్, రమేష్, వేణుగోపాల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

నర్వ: మండల విండో కార్యాలయంలో రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని ఏఓ గణేష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 162 బస్తాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 30 కేజీల బస్తాకు ధర రూ. 843 నిర్ణయించినట్లు వివరించారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్కుల జిరాక్స్ కాపీలతో తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు.

నేడు దివ్యాంగులకు బస్ పాస్ మేళా

మక్తల్: పట్టణంలో ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో శనివారం దివ్యాంగులకు ప్రత్యేకంగా బస్ పాస్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ డి.ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు సదరం సర్టిఫికెట్ తోపాటు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకొనిరావాలని కోరారు. 50 శాతం రాయితీతో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మిగతా వివరాలకు సెల్: 73828 27884 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైతుబంధుకు దరఖాస్తుల ఆహ్వానం

మాగనూర్: వానాకాలం–2023 సంవత్సరానికి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం కలిగిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏఓ సుదర్శన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు కోసం అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకుని సంబంధిత గ్రామ విస్తరణ అధికారులకు ఇవ్వాలని కోరారు.

జిన్నారంలో ఇసుక అక్రమ రవాణా

మరికల్: మండలంలోని జిన్నారం శివారులో ఉన్న మన్నెవాగులో నుంచి ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా వ్యాపారులు ఇతర గ్రామాలకు దర్జాగా ఇసుకను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నట్లు ఇళ్ల నిర్మాణాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటన్ని ప్రశ్నిస్తే అధికారులకు ట్రాక్టర్‌కు రూ. 2 వేల చొప్పున చెల్లిస్తేనే వాగులోంచి ఇసుకు కొట్టుకోవడం కోసం అనుమతి ఇస్తారని, లేదంటే కేసులు చేస్తున్నారని ఇసుక వ్యాపారులు చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు ఇస్తున్న డబ్బుల భారం ఇళ్ల నిర్మించుకునే వారిపై మోపుతున్నారని వాపోతున్నారు. ఇంత పెద్ద ఎత్తున ఇసుక అక్రమ వ్యాపారం సాగుతున్నా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జిన్నారం శివారులోని మన్నెవాగులో తవ్విన ఇసుక గొయ్యి

'కోటకొండ'పై వివక్ష సరికాదు



మాట్లాడుతున్న గద్దం గోపాల్

నారాయణపేట రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో మండలాలను ప్రకటించిన ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న కోటకొండపై వివక్ష చూయించడం సరికాదని బీజేపీ పాలమూర్ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం గోపాల్ విమర్శించారు. మండలంలోని కోటకొండలో శుక్రవారం అభంగాపూర్ గ్రామస్తుల తరఫున 17వ రోజు రిలేదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌ను మండలాలుగా ప్రకటించి, అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనన్నారు. చుట్టు పక్కల ఎన్నో గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉందని, వెంటనే ఎమ్మెల్యే చొరువ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కోటకొండను మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, కాశీనాథ్, కెంచె శ్రీనివాసులు, నర్సింహులు, రాములు, చెన్నప్ప, ప్రవీన్, బాలకృష్ణ, బలరాం, హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహులు, దస్తప్ప, సాయిలు, ఆంజనేయులు, తిరుపతి, గుండప్ప పాల్గొన్నారు.

రేపు చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహావిష్కరణ

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో ఈ నెల 28న స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తునట్లు పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు తెలిపారు. శుక్రవారం బిజ్వార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విగ్రహ ఆవిష్కరణకు సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కోటు రంగారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేజీ రాంచందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు హన్మేష్ హాజరవుతారన్నారు. వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అనీల్, ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు

నాణతా ప్రమాణాలు పాటించాలి

ఊట్కూరు: మండలంలోని పగిడిమారి గ్రామ శివారులో కల్వర్టు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టు పనులకు రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సులోచనమ్మ, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, ఎంపీటీసీ జాఫర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, కత్తాల్ సాయబ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మాగనూర్: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మపల్లి గ్రామ ఊర చెరువులో గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువులో చేపలు పట్టారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపలు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. చెరువులో విడుదల చేసిన చేపపిల్లలు ప్రస్తుతం రెండు నుంచి నాలుగు కిలోల బరువు వరకు పెరిగాయని పేర్కొన్నారు. చేపలు విక్రయించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, బాలకృష్ణ, లింగప్ప, రవి, బాలప్ప, గోపాల్, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మపల్లి చెరువులో పట్టిన చేపలు

సాగు మెలకువలు పాటించాలి

దామరగిద్ద: వానాకాలం సీజన్ సమీపిస్తున్నందున తొలకరి వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకోవడం, జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట సాగు, విత్తన శుద్ధితో పంటల సాగు వంటి సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ అరవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిడెంపల్లిలో రైతులతో సమావేశమై సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ సాగుతో సహజసిద్ధ షోషకాలు పెరిగి నేల సారవంతమవుతుందన్నారు. పంటల సాగుకు ముంద లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా ఎండ తీవ్రతకు నేలలోని చీడపడలు నాశనం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ లక్ష్మి, శ్రీనివాస్, ఏఈఓ భార్గవి రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

దామరగిద్ద: విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్‌రావు, ఏఓ అరవింద్ హెచ్చరించారు. ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండలంలోని కూపన్‌పల్లి, క్యాతన్‌పల్లి తదితర ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి సమక్షంలో తనిఖీ చేపట్టడంతో పాటు రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి సమాచారం అందించాలన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవించే రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే చట్టపరంగా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘించే వెంచర్లపై చర్యలు

- బఫర్ జోన్‌ల గుర్తింపుల్లో అవకతవకలు
- కేవీఆర్ వెంచర్‌ను పరిశీలించిన కమిషనర్
- టౌన్‌ప్లానర్‌కు ఫిర్యాదు

అమరచింత: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తూ.. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే వారిపై చర్యలు తప్పవని, అలాంటి వెంచర్లకు అనుమతులను నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. బీసీ కాలనీలో సర్వే నంబర్ 647లో సుమారు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో ఇటీవల నాలా పర్మిషన్ తీసుకొని, వెంచర్ ఏర్పాటు చేయడానికి డీటీసీపీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కేవీఆర్ వెంచర్‌గా నామకరణం చేసిన నిర్వాహకులు ఎత్తిపోతల కాల్వ, భీమా కాల్వలు వెంచర్ సమీపంలో వెళ్తున్నాయని, దీనికి ఇరిగేషన్ శాఖ అధికారుల సూచనల మేరకు స్థలాన్ని వదలకుండా వాటిలోనే మున్సిపాలిటీకి 10శాతం స్థలాన్ని కేటాయించారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం కమిషనర్ వెంచర్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. కెనాల్‌కు 17 మీటర్ల దూరంలో వెంచర్ ఉండాలని, వాటిని అతిక్రమించినట్లు గుర్తించామన్నారు. వీటికోసం టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. నీటిపారుదల కాల్వలు, చెరువులు ఉన్న చోట బఫర్ జోన్‌గా గుర్తించి భవిష్యత్‌లో వెంచర్‌లోని ఇంటి స్థలాలకు సీ పేజ్ రాకుండా ఉండేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు చూపిన విధంగా స్థలాలను వదలాలని ఆయన అన్నారు.



వెంచర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మహమ్మద్‌ఖాజా

తొలగని 11కేవీ లైన్

కేవీఆర్ వెంచర్‌లో ఇప్పటి వరకు అన్ని పనులు పూర్తయ్యాయని, అనుమతులు ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్న సదరు యాజమాని ఇప్పటి వరకు 11 కేవీ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించలేదు. ఈవిషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు నివేదించి వాటిని తొలగించినపుడే అనుమతి ఇస్తామన్నారు.